సాక్షి నాగర్‌కర్నూల్

మంగళవారం । 5 । డిసెంబర్ । 2023



ఆభరణాల తొలగింపు

కురుమూర్తి జాతర ముగియడంతో స్వామివారి ఆభరణాలు తొలగించారు.

వివరాలు 10లో ▸



పట్టుబట్టి.. విజయం

అలంపూర్‌లో విజయుడిని గెలిపించి చల్లా వెంకట్రామిరెడ్డి పట్టు నిలుపుకొన్నారు.

వివరాలు 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 33.4 /17.8

రోజంతా ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉదయం, రాత్రివేళలో చల్లని గాలులు వీస్తాయి. మునురు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఓపెన్ ఎస్సెస్సీ, ఇంటర్ పరీక్ష ఫలితాలు విడుదల

- పదిలో 4,053..
- ఇంటర్‌లో 8,191 మంది ఉత్తీర్ణత

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గత అక్టోబర్‌లో నిర్వహించిన ఓపెన్ స్కూల్ ఎస్సెస్సీ, ఇంటర్ పరీక్ష ఫలితాలను ప్రభుత్వం సోమవారం విడుదల చేసింది. ఈ మేరకు ఉమ్మడి జిల్లాలో ఎస్సెస్సీలో మొత్తం 11,357 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 4,053 మంది విద్యార్థులు పాసై.. 35.69 ఉత్తీర్ణత శాతం నమోదు చేశారు. అలాగే ఓపెన్ ఇంటర్‌లో 15,348 మంది విద్యార్థులు పరీక్ష రాయగా.. 8,191 మంది విద్యార్థులు పాసవగా.. 53.37 శాతం ఉత్తీర్ణత నమోదు చేశారు. ఎస్సెస్సీ వారు రీ కౌంటింగ్ రూ.350, రీ వెరిఫికేషన్‌కు రూ.1,200, ఇంటర్ వారు రీ వెరిఫికేషన్‌కు రూ.400, రీ కౌంటింగ్‌కు రూ.1,200 చెల్లించాలని డీఈఓ రవీందర్ ఒక ప్రకటనలో తెలిపారు.

టెన్త్ పరీక్ష ఫీజు గడువు పెంపు

కందనూలు: పదో తరగతి పరీక్ష ఫీజు చెల్లింపు గడువును ఈ నెల 7వ తేదీ వరకు పెంచినట్లు డీఈఓ గోవిందరాజులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే ఏడాది మార్చిలో జరగబోయే పదో తరగతి రెగ్యులర్ పరీక్షకు, ఒకేషనల్ సర్టిఫికెట్ కోసం ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల విద్యార్థులు ఈ నెల 7లోగా ఎటువంటి అపరాధ రుసుం లేకుండా ఫీజు చెల్లించవచ్చని పేర్కొన్నారు. రూ.50 అపరాధ రుసుంతో ఈ నెల 14వ తేదీ, రూ.200తో 21వ తేదీ, రూ.500తో జనవరి 3వ తేదీలోగా ఫీజు చెల్లించవచ్చన్నారు. రెగ్యులర్ విద్యార్థులు అన్ని సబ్జెక్టులకు కలిపి రూ.125తో చెల్లించాలన్నారు. పదో తరగతి పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులు మూడు సబ్జెక్టుల వరకు రూ.110, మూడు సబ్జెక్టుల కంటే ఎక్కువ ఉంటే రూ.125, ఒకేషనల్ విద్యార్థులు రెగ్యులర్ పరీక్ష రుసుంతో పాటు అదనంగా రూ.60 చెల్లించాలని తెలియజేశారు. ప్రస్తుతం పదో తరగతి చదువుతున్న విద్యార్థులు నిర్ణీత గడువులోనే అపరాధ రుసుం లేకుండా పరీక్షలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఆయన సూచించారు.

జాతీయ సదస్సు వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లాకేంద్రంలోని ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో ఈ నెల 20న డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఇన్ ఇండియా ప్రాస్పెక్ట్ చాలెంజెస్ అనే అంశంపై జాతీయ సదస్సు నిర్వహించనున్నారు. అందుకు సంబంధించి వాల్‌పోస్టర్‌ను పీయూ వీసీ లక్ష్మీకాంత్ రాథోడ్, రిజిస్ట్రార్ గిరిజ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇలాంటి సెమినార్లు విద్యార్థులకు, అధ్యాపకులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయయన్నారు. సమాజంలో వస్తున్న మార్పులపై చర్చించేందుకు ఒక చక్కటి వేదిగా సెమినార్ ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ కళాశాల ప్రిన్సిపాల్ విజయ్ కుమార్, అధ్యాపకులు సూరయ్య జబీన్, శ్రీనివాసులు, రఘువీర్‌గుప్తా, ప్రదీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముడా డైరెక్టర్ పదవికి రాజీనామా

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ/జడ్చర్ల టౌన్: మహబూబ్‌నగర్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ముడా) డైరెక్టర్ పదవికి జడ్చర్లకు చెందిన వైజీ ప్రీతమ్ సోమవారం రాజీనామా చేశారు. రాజీనామా పత్రాన్ని ముడా చైర్మన్, వైస్ చైర్మన్, కలెక్టరేట్‌లో అందజేశారు. వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేస్తున్నట్లు పేర్కొన్నారు. అయితే వాస్తవానికి జడ్చర్ల ఎమ్మెల్యేగా లక్ష్మారెడ్డి ఓటమి పాలవడంతో మనస్తాపం చెంది రాజీనామా చేశారని, లక్ష్మారెడ్డి వల్ల వచ్చిన డైరెక్టర్ పదవి ఆయన ఎమ్మెల్యేగా లేనప్పుడు తనకు వద్దని సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశారు.

సౌత్‌జోన్ పోటీలకు అథ్లెటిక్స్ ఎంపికలు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు పాలమూరు యూనివర్సిటీ వివిధ జట్ల ఎంపిక చేపడుతున్నట్లు పీయూ పీడీ శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 7న స్త్రీ, పురుషుల జట్లకు రన్నింగ్, అథ్లెటిక్స్, త్రోయింగ్, జంపింగ్ వంటి పోటీలతోపాటు హ్యాండ్ బాల్ ఎంపికలు కూడా నిర్వహిస్తామన్నారు. ఎంపికలు జిల్లాకేంద్రంలోని స్టేడియం గ్రౌండ్‌లో జరుగుతాయని, పీయూ పరిధిలోని వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొనాలని కోరారు.

అమాత్యగిరి ఎవరికో..

ఉమ్మడి జిల్లా నుంచి ఇద్దరికి అవకాశం

- సీఎం రేసులో రేవంత్.. లేదంటే కీలక మంత్రిత్వ శాఖ ఖాయం
- జూపల్లి కృష్ణరావు, చిక్కుడు వంశీకృష్ణలో ఒకరికి చాన్స్
- తెరపైకి ముదిరాజ్ వర్గానికి చెందిన వాకిటి శ్రీహరి పేరు
- రాష్ట్రంలో సామాజిక సమీకరణలపై లెక్కలేస్తున్న ఆశావహులు



సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: త్వరలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటుకానున్న నేపథ్యంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నుంచి మంత్రి పదవులు ఎవరిని వరిస్తాయనే అంశం హాట్‌టాపిక్‌గా మారింది. ఒకరికా.. ఇద్దరికా? ఏ నియోజకవర్గం, ఏ జిల్లాకు అవకాశం దక్కనుంది? అనే దానిపై రాజకీయ వర్గాల్లో ఊహాగానాలు వెల్లువెత్తున్నాయి. పాలమూరుకు చెందిన టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించిన పక్షంలో మంత్రిగా మరొకరికేనా లేక ఇద్దరికీ చాన్స్ దక్కుతుందా? అంటూ చెవులు కొరుక్కుంటున్నారు. ఈ మేరకు రాష్ట్రంలో సామాజిక సమీకరణలు, మంత్రి వర్గ కూర్పుపై ఆశావహులు ఎవరికి వారు లెక్కలేసుకుంటున్నారు. రాష్ట్రంలో 'హస్తం' అధికారంలోకి రావడానికి ఉమ్మడి జిల్లా ఫలితాలు దోహదం చేశాయి. 14 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 12 స్థానాలు గెలిచిన నేపథ్యంలో మంత్రివర్గంలో జిల్లాకు పెద్దపీట వేస్తారని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

జూపల్లి లేదంటే చిక్కుడు..

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ప్రాభవాన్ని కోల్పోయి అచేతన స్థితిలో కొట్టుమిట్టాడుతున్న కాంగ్రెస్‌కు టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి అలుపెరగని పోరాటంతో ఊపిరిలూదారు. ఎన్నికల షెడ్యూల్ విడుదల కానున్న క్రమంలో ఉమ్మడి జిల్లాలో బీఆర్ఎస్ నుంచి మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ సరితాతిరుపతయ్య, ఎంపీపీ మేఘారెడ్డి, బీజేపీ నుంచి యెన్నం శ్రీనివాస్‌రెడ్డి వంటి ముఖ్య నేతల చేరికలు హస్తానికి ప్రయోజనకరంగా మారాయి. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్‌కు చెందిన సీనియర్ రాజకీయ నేత, మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరి రేవంత్‌కు మద్దతుగా నిలిచారు. చేరికల్లో ఆయన క్రియాశీలకంగా పని చేయడంతో పాటు ఉమ్మడి రాష్ట్రంలో రెండుసార్లు, తెలంగాణ రాష్ట్రంలో ఒక పర్యాయం మంత్రిగా పని చేసిన అనుభవం ఉంది. ప్రస్తుతం ఎమ్మెల్యేగా విజయం సాధించిన నేపథ్యంలో ఆయనకే మంత్రి పదవి వరించే అవకాశం ఎక్కువ ఉన్నట్లు తెలుస్తోంది. మరోవైపు మంత్రిగా అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ పేరు సైతం వినిపిస్తోంది. ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన ఆయన మొదటి నుంచీ కాంగ్రెస్‌లో క్రియాశీలకంగా ఉన్నారు. ఇప్పటివరకు నాలుగు పర్యాయాలు ఓటమి పాలు కాగా.. రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. రాష్ట్రవ్యాప్తంగా సామాజిక వర్గాల కూర్పు మేరకు జూపల్లి లేదంటే వంశీకృష్ణను మంత్రి పదవి వరించనున్నట్లు సమాచారం.

పార్లమెంట్‌కు ఒక్కరు చొప్పున..

ఉమ్మడి జిల్లా రెండు పార్లమెంట్ నియోజకవర్గాల (మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్) పరిధిలో ఉంది. మహబూబ్‌నగర్ ఎంపీ సెగ్మెంట్‌లో షాద్‌నగర్, జడ్చర్ల, మహబూబ్‌నగర్, దేవరకద్ర, మక్తల్, నారాయణపేట, కొడంగల్.. నాగర్‌కర్నూల్ పరిధిలో అచ్చంపేట, నాగర్‌కర్నూల్, కొల్లాపూర్, కల్వకుర్తి, వనపర్తి, గద్వాల, అలంపూర్ అసెంబ్లీ నియోజకవర్గాలు వస్తాయి. ఈ మేరకు పార్లమెంట్ నుంచి ఒక్కొక్కరికి చొప్పున ఇద్దరిని అమాత్య పదవి వరించనున్నట్లు తెలుస్తోంది.


వాకిటి శ్రీహరి పేరు సైతం..

మహబూబ్‌నగర్ పార్లమెంట్‌కు సంబంధించి ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా.. కొడంగల్‌లో రేవంత్‌రెడ్డి, మహబూబ్‌నగర్‌లో యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మినహా మిగతా ఐదుగురు ఎమ్మెల్యేలుగా కొత్తగా ఎన్నికైనవారే. రేవంత్‌రెడ్డికి సీఎం పదవి లేదా కీలక మంత్రిత్వ శాఖ ఇస్తారనేది ఖాయం. ఈ క్రమంలో మంత్రిగా మరొకరికి అవకాశం ఇస్తారా అనేది ప్రశ్నార్థకంగా మారింది. అయితే ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి పేరు తెరపైకి వచ్చింది. ఎన్నికల సమయంలో బీఆర్ఎస్ రాష్ట్రంలో ముదిరాజ్ వర్గానికి ఒక్క టికెట్ కూడా కేటాయించకపోవడం కాంగ్రెస్‌కు ప్రధానాస్త్రంగా మారిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో వాకిటికి మంత్రిగా అవకాశం ఇవ్వొచ్చనే ప్రచారం జరుగుతోంది. ఆయనకు దక్కని పక్షంలో సామాజిక సమీకరణలు కలిసొస్తే రేవంత్‌కు సన్నిహితుడిగా పేరొందిన మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డిని అమాత్య పదవి వరించనున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

కారు దిగి.. కాంగ్రెస్‌లో చేరి

ఎమ్మెల్యేలుగా గెలిచిన ఆ నలుగురు

- కల్వకుర్తిలో ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి
- నాగర్‌కర్నూల్‌లో రాజేష్‌రెడ్డి, కొల్లాపూర్‌లో జూపల్లి కృష్ణారావు
- వనపర్తిలో విజయం సాధించిన మేఘారెడ్డి



కసిరెడ్డి నారాయణరెడ్డి



రాజేష్‌రెడ్డి



మేఘారెడ్డి

సాక్షి, నాగర్‌కర్నూల్: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని పలువురు బీఆర్ఎస్ నేతలు ఎన్నికలకు ముందు కాంగ్రెస్‌లో చేరి ఎమ్మెల్యేలుగా గెలుపొందారు. టికెట్ దక్కక కొందరు.. కర్ణాటకలో కాంగ్రెస్ గెలుపు తర్వాత రాష్ట్రంలో ఆ పార్టీకి పెరిగిన క్రేజ్ నేపథ్యంలో మరికొందరు కాంగ్రెస్‌లో చేరి గెలుపు అవకాశాలను అందిపుచ్చుకున్నారు. కొల్లాపూర్‌లో మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు, కల్వకుర్తిలో ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి, నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలో కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి, వనపర్తిలో ఎంపీపీ మేఘారెడ్డి ఎన్నికలకు కొన్ని నెలల ముందే బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. ఆదివారం వెల్లడైన అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో వీరంతా ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు.

దక్కని ఫలితం..

అసెంబ్లీ ఎన్నికలకు మూడు నెలల ముందు నుంచే ఉమ్మడి పాలమూరు జిల్లాలో ప్రధాన పార్టీల ఎన్నికల హడావుడి మొదలైంది. బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ పాలమూరుపై ప్రత్యేక దృష్టిసారించినా ఫలితం దక్కలేదు. పాలమూరు– రంగారెడ్డి ప్రాజెక్టు ఎత్తిపోతల మొదటి మోటారు ప్రారంభంతో పాటు ఎన్నికల ప్రచారంలో భాగంగా పలుమార్లు ఉమ్మడి జిల్లాలో పర్యటించారు. పాలమూరులోని అన్ని నియోజకవర్గాల్లో సీఎం కేసీఆర్ బహిరంగసభలు నిర్వహించారు. అయితే నడిగడ్డ ప్రాంతంలోని గద్వాల, అలంపూర్ మినహా ఉమ్మడి జిల్లాలోని మిగతా 12 చోట్ల బీఆర్ఎస్‌కు ఓటమి తప్పలేదు.

■ బీజేపీ సైతం ఉమ్మడి పాలమూరులోని పలు నియోజకవర్గాల్లో గంపెడాశలు పెట్టుకుంది. ప్రధాని మోదీతో పాటు జాతీయ అధ్యక్షుడు నడ్డా, కేంద్ర మంత్రులు అమిత్ షా, నితిన్ గడ్కరీ, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తదితర హేమాహేమీలతో ప్రచారం నిర్వహించింది. ఉమ్మడి జిల్లాలోని మహబూబ్‌నగర్, కల్వకుర్తి, మక్తల్ తదితర చోట్ల ఆ పార్టీ ఆశలు పెట్టుకోగా ఎన్నికల ఫలితాల్లో మాత్రం నిరాశే మిగిలింది. ఎన్నికల ఫలితాల అనంతరం బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు పోస్టుమార్టం పేరుతో అంతర్మథనంలో పడ్డాయి. ఎక్కడ పొరపాటు జరిగింది.. ఏయే విషయాల్లో వెనకబడ్డాం తదితర వాటిపై సమీక్ష జరుపుతున్నారు.

9 మంది కొత్తవారే..

ఉమ్మడి పాలమూరు జిల్లాలో మొత్తం 14 నియోజకవర్గాలకు గాను కాంగ్రెస్ 12 స్థానాలను కైవసం చేసుకుంది. అయితే ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఈసారి ఎన్నికల్లో 9 మంది కొత్తవాళ్లు ఎమ్మెల్యేగా గెలుపొందడం విశేషం. జడ్చర్లలో జనంపల్లి అనిరుద్‌రెడ్డి, నాగర్‌కర్నూల్‌లో కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి, కల్వకుర్తిలో కసిరెడ్డి నారాయణరెడ్డి, వనపర్తిలో మేఘారెడ్డి, నారాయణపేటలో చిట్టెం పర్ణికారెడ్డి, దేవరకద్రలో జి.మధుసూదన్‌రెడ్డి, మక్తల్‌లో వాకిటి శ్రీహరి, షాద్‌నగర్‌లో వీర్లపల్లి శంకర్ కాంగ్రెస్ అభ్యర్థులుగా విజయం సాధించగా.. అలంపూర్‌లో బీఆర్ఎస్ అభ్యర్థిగా విజయుడు గెలుపొందారు.

కలిసొచ్చిన కొత్త పార్టీ..

గత ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసిన జూపల్లి కృష్ణారావు అప్పటి కాంగ్రెస్ అభ్యర్థి బీరం హర్షవర్ధన్‌రెడ్డి చేతిలో ఓటమిపాలయ్యారు. అనంతరం హర్షవర్ధన్‌రెడ్డి బీఆర్ఎస్‌లో చేరగా జూపల్లికి ఇంటిపోరు మొదలైంది. సీఎం కేసీఆర్ సిట్టింగ్‌లకే సీట్లను ప్రకటించడంతో జూపల్లి బీఆర్ఎస్‌ను వీడి ఆగస్టులో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. జూపల్లి వెంటే బీఆర్ఎస్ నేత, ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి తనయుడు రాజేష్‌రెడ్డి సైతం ఢిల్లీలోని పెద్దల సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. అలాగే వనపర్తి జిల్లాలోని పెద్దమందడి ఎంపీపీ, బీఆర్ఎస్ నేత మేఘారెడ్డి సైతం ఆగస్టులోనే పార్టీని వీడి కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఇప్పటి వరకు ఎంపీపీగా ఉన్న మేఘారెడ్డి కాంగ్రెస్ తరఫున బరిలో నిలిచి మంత్రి నిరంజన్‌రెడ్డిని ఓడించి ఎమ్మెల్యేగా గెలిచారు. ఇక బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్సీగా గెలిచిన కసిరెడ్డి నారాయణరెడ్డి కల్వకుర్తిలో పార్టీ టికెట్‌ను ఆశించారు. అయితే బీఆర్ఎస్ పార్టీ టికెట్ మళ్లీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌కే దక్కడంతో ఎమ్మెల్సీ కసిరెడ్డి అక్టోబర్ నెలలో కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ తరఫున పోటీచేసిన వీరంతా విజయం సాధించగా.. గద్వాలలో కారు దిగి కాంగ్రెస్ నుంచి బరిలో నిలిచిన జెడ్పీ చైర్‌పర్సన్ సరిత మాత్రం ఓటమిపాలయ్యారు.

ఆ నలుగురు.. లక్ష ఓట్లకు అధిపతులు

- అత్యధిక మెజారిటీ కూడా వారికే..

ఉమ్మడి జిల్లాకు సంబంధించి అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో నలుగురు అభ్యర్థులకు లక్షకు పైగా ఓట్లు వచ్చాయి. అత్యధిక మెజారిటీలు కూడా వారికే ఉండడం విశేషం. అచ్చంపేట నియోజకవర్గంలో 2,42,129 మంది ఓటర్లు ఉండగా.. 1,93,765 ఓట్లు పోలయ్యాయి. ఇందులో కాంగ్రెస్ అభ్యర్థి చిక్కుడు వంశీకృష్ణకు 1,15,337 ఓట్లు రాగా.. సమీప ప్రత్యర్థి, బీఆర్ఎస్ అభ్యర్థి గువ్వల బాలరాజుకు 66,011 ఓట్లు వచ్చాయి. దీంతో ఉమ్మడి జిల్లాలోనే అత్యధికంగా 49,326 ఓట్ల భారీ మెజారిటీతో గెలుపొందారు. కొడంగల్ నియోజకవర్గంలో 2,36,625 మంది ఓటర్లు ఉండగా.. 1,93,940 ఓట్లు పోలయ్యాయి. ఇందులో కాంగ్రెస్ అభ్యర్థి రేవంత్‌రెడ్డికి 1,07,429 ఓట్లు రాగా.. బీఆర్ఎస్ అభ్యర్థి పట్నం నరేందర్‌రెడ్డికి 74,897 ఓట్లు పడ్డాయి. దీంతో రేవంత్ 32,532 ఓట్లతో విజయం సాధించారు. వనపర్తి నియోజకవర్గంలో 2,71,151 మంది ఓటర్లు ఉండగా.. 2,10,739 ఓట్లు పోలయ్యాయి. ఇందులో కాంగ్రెస్ అభ్యర్థి తూడి మేఘారెడ్డికి 1,07,115 ఓట్లు రాగా.. బీఆర్ఎస్ అభ్యర్థి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డికి 81,795 ఓట్లు వచ్చాయి. దీంతో మేఘారెడ్డి 25,320 మెజారిటీతో నెగ్గారు. అలంపూర్ నియోజకవర్గంలో 2,37,938 మంది ఓటర్లు ఉండగా.. 1,96,307 ఓట్లు పోలయ్యాయి. ఇందులో బీఆర్ఎస్ అభ్యర్థి విజయుడుడి 1,04,060 ఓట్లు రాగా.. కాంగ్రెస్ అభ్యర్థి సంపత్ కుమార్‌కు 73,487 ఓట్లు పడ్డాయి. దీంతో విజయుడు 30,573 ఓట్ల తేడాతో ఘన విజయం సాధించారు.



\- సాక్షి డెస్క్, మహబూబ్‌నగర్

జోగుళాంబ సన్నిధిలో ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే

అలంపూర్: అలంపూర్ జోగుళాంబ అమ్మవారిని ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యే విజయుడు సోమవారం దర్శించుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ చిన్న కృష్ణయ్య నాయుడు అర్చక స్వాములతో కలిసి వారికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే శ్రీబాలబ్రహ్మేశ్వర స్వామి, శ్రీజోగుళాంబ అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చక స్వాములు వారికి తీర్థ ప్రసాదాలను అందజేసి ఆశీర్వచనం పలికారు. ఆలయ కమిటీ చైర్మన్ వారిని శాలువాతో సత్కరించారు.

అంతర్జాతీయ టార్గెట్‌బాల్ పోటీలకు విద్యార్థి ఎంపిక

పెబ్బేరు రూరల్: అంతర్జాతీయ టార్గెట్‌బాల్ పోటీలకు పెబ్బేరులోని మాస్టర్‌మైండ్ పాఠశాల 10వ తరగతి విద్యార్థి డి.లోకేష్ ఎంపికైనట్లు డైరెక్టర్ రంగారెడ్డి తెలిపారు. నేపాల్‌లోని ఖాట్మండులో ఈ నెల 7 నుంచి 11వ తేదీ వరకు జరిగే పోటీల్లో పాల్గొంటారని వివరించారు.

ఫిర్యాదులు త్వరగా పరిష్కరించాలి

- ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్



ఫిర్యాదుదారుల సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్

నాగర్‌కర్నూల్ క్రైం: పోలీసు ప్రజావాణికి వచ్చే ఫిర్యాదులు త్వరగా పరిష్కరించేందుకు పోలీసు సిబ్బంది నిరంతరం కృషి చేయాలని ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన పోలీసు ప్రజావాణిలో ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడారు. పోలీసు ప్రజావాణికి 3 ఫిర్యాదులు వచ్చాయని, ఇందులో 1 భూతగాదా ఫిర్యాదు, 2 చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులు వచ్చినట్లు తెలియజేశారు.

బాదేపల్లిలో డబుల్ బెడ్‌రూంల లొల్లి

తాళాలు పగులగొట్టి స్వాధీన పర్చుకునేందుకు యత్నం

- పోలీసుల రంగప్రవేశంతో వెనుదిరిగిన ప్రజలు
- కౌన్సిలర్లే చెప్పారని పలువురి ఆరోపణ
- ఎన్నికల ఫలితాలు వెలువడిన మరుసటి రోజే ఘటన



ఎర్రగుట్ట డబుల్ బెడ్‌రూం ఇళ్లను స్వాధీనం చేసుకునేందుకు వచ్చిన ప్రజలు



డబుల్ బెడ్‌రూం ఇళ్లకు తాళం వేసుకుంటున్న ఆందోళనకారులు



తాళం విరగొడుతున్న ఓ మహిళ

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని ఎర్రగుట్ట డబుల్ బెడ్‌రూంల వద్ద సోమవారం ఉద్రిక్త వాతావరణం నెలకొంది. తెల్లవారుజామునే కొందరు ప్రజలు కుటుంబ సభ్యులు, నివాస సామగ్రితో ఆటోల్లో వచ్చి డబుల్ బెడ్‌రూంల తాళాలు విరగ్గొట్టి ఇళ్లను స్వాధీనపర్చుకున్నారు. విషయం తెలియగానే అక్కడికి పెద్దసంఖ్యలో ప్రజలు వచ్చి ఎవరికి తోచిన ఇంటిని వారు స్వాధీనపర్చుకునేందుకు యత్నించారు. దీంతో అక్కడ ఇళ్ల కోసం ప్రజల మధ్య వాగ్వాదం జరిగి తోపులాట చోటు చేసుకుంది. కొద్దిసేపు అక్కడ ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. సమాచారం అందుకునన పోలీసులు అక్కడికి చేరుకుని ప్రజలను అక్కడి నుంచి పంపించేందుకు యత్నించారు. డబుల్ బెడ్‌రూంల ఇళ్ల కేటాయింపులు అధికారులు చేసిన తర్వాతే రావాలని నచ్చజెప్పేందుకు యత్నించారు. అయితే కొందరు పోలీసులతోనూ వాగ్వాదానికి దిగారు. చివరికి పోలీసులు గట్టిగా హెచ్చరిక చేయడంతో ఇళ్లను వదిలి వెళ్లిపోయారు.

560 ఇళ్ల నిర్మాణం పూర్తి

ఎర్రగుట్ట వద్ద మొత్తం 560 ఇళ్ల నిర్మాణం పూర్తయ్యింది. 2018లోనే సగం ఇళ్లు పూర్తయినా ఇప్పటి వరకు ఎవరికీ కేటాయించలేదు. అయితే ఐదు నెలల క్రితం అప్పటి మున్సిపల్‌శాఖ మంత్రి కేటీఆర్ డబుల్ బెడ్‌రూం ఇళ్లను ప్రారంభించి ఐదు మంది లబ్ధిదారులకు పంపిణీ చేసి వెళ్లారు. ఆ తర్వాత పట్టణంలోని అన్ని వార్డుల్లోనూ అప్పటి ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి పర్యటించి లబ్ధిదారుల ఎంపిక చేపట్టారు. ఆ ప్రక్రియలో భాగంగానే కొందరు లబ్ధిదారుల జాబితా తయారు చేయగా.. దాని ఆధారంగా పట్టాలు పంపిణీ చేయాల్సి ఉంది. ఈ క్రమంలోనే సాధారణ ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో ప్రక్రియ నిలిచిపోయింది.

ఫలితాల మరుసటి రోజే ఘటన

నిన్నటి వరకు జడ్చర్ల ఎమ్మెల్యేగా లక్ష్మారెడ్డి ఉండగా.. ఎన్నికల తర్వాత డబుల్ బెడ్‌రూంలు ఇస్తామని స్థానిక నాయకులు, కౌన్సిలర్లు ప్రజలకు హామీ ఇచ్చారు. కొందరు డబుల్ బెడ్‌రూంలు ఇప్పిస్తామని చెప్పి డబ్బులు సైతం వసూలు చేశారు. అయితే ఎమ్మెల్యేగా కాంగ్రెస్ పార్టీ నుంచి అనిరుధ్‌రెడ్డి గెలుపొందడంతో పరిణామాలు ఒక్కసారిగా మారిపోయాయి. ఈ క్రమంలోనే డబుల్ బెడ్‌రూం ఇళ్ల కోసం వేచి ఉన్న వారిని వెళ్లి స్వాధీనపర్చుకోమని 18, 5వ వార్డుల కౌన్సిలర్లతోపాటు కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఉసిగొల్పినట్లు అక్కడికి వచ్చిన వారు చెప్పారు. ఇందుకు పెద్దఎత్తున డబ్బులు డిమాండ్ చేసినట్లు వారు ఆరోపించారు.

క్రీడాకారులు మెళకువలు నేర్చుకోవాలి

కందనూలు: జూనియర్ 42వ రాష్ట్ర స్థాయి ఖోఖో చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనే ఉమ్మడి జిల్లా బాల, బాలికల జట్టుకు సోమవారం జిల్లా కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో కోచింగ్ క్యాంపు ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్‌పీసీ కోఆర్డినేటర్ ప్రసాద్ గౌడ్ మాట్లాడారు. కోచింగ్ క్యాంప్ క్రీడాకారులకు మెళకువలతో పాటు క్రమశిక్షణ, క్రీడాకారుల మధ్య సమన్వయం వంటి ముఖ్యమైన అంశాలు నేర్చుకోవాలన్నారు. జిల్లా జట్టును క్రీడాకారులు రాష్ట్ర స్థాయిలో విజయపథంలో నడిపించడానికి ఈ అంశాలు దోహదపడుతాయన్నారు. అనంతరం జిల్లా సైన్స్ అధికారి కృష్ణారెడ్డి మాట్లాడారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా జట్టుకు ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు ఎంపికయ్యారని, జట్టు విజయం సాధించడానికి మరికొంత కష్టపడితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎస్‌జీఎఫ్ కార్యదర్శి వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ఎస్‌పీసీ కోఆర్డినేటర్ ప్రసాద్ గౌడ్

క్లుప్తంగా

కళాశాల వెళ్లమన్నందుకు విద్యార్థి ఆత్మహత్య

నాగర్‌కర్నూల్ క్రైం: కళాశాలకు వెళ్లమన్నందుకు మనస్తాపానికి గురై విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని వెంకటపూర్‌లో సోమవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ మహేందర్ తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా.. మండలంలోని వెంకటాపూర్‌కు చెందిన యశ్వంత్‌రెడ్డి (17) హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ చదువుతున్నాడు. ఈనెల 2న కళాశాల నుంచి స్వగ్రామం వెంకటపూర్‌కు వచ్చాడు. తిరిగి కళాశాలకు వెళ్లేందుకు ఇష్టం లేకపోవడంతో తండ్రి కళాశాలకు వెళ్లమని చెప్పడంతో మనస్తాపానికి గురై ఇంట్లోనే పురుగుల మందు తాగాడు. పొలానికి వెళ్లి ఇంటికి వచ్చిన కుటుంబసభ్యులు గుర్తించి చికిత్స నిమిత్తం జనరల్ ఆస్పత్రికి తరలించగా యశ్వంత్‌రెడ్డి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి తండ్రి తిరుపతిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బస్సు టైర్ కిందపడి విద్యార్థికి తీవ్రగాయాలు

బాలానగర్: మండలంలోని గంగదారిపల్లి పంచాయతీ కుంటలోపు తండాకు చెందిన పత్లావత్ అశోక్ బస్సు ఎక్కబోయి టైర్ కింద పడి తీవ్ర గాయాలయ్యాయి. రంగారెడ్డి జిల్లా ఫరూఖ్‌నగర్ మండలం రాయికల్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో 4వ తరగతి విద్యను అభ్యసించేందుకు పాఠశాల నుంచి తిరిగి తండాకు వచ్చే సమయంలో రాయికల్‌లో బస్సు ఎక్కే సమయంలో బస్సు వెనకాల టైర్ కింద పడడంతో కాలికి తీవ్ర గాయమైంది. బాలున్ని హుటాహుటిన షాద్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి అక్కడ నుంచి హైదరాబాద్ తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉందని గ్రామస్తులు పేర్కొన్నారు. ఈ ఘటనతో తండ్రి పాత్లావత్ తావుర్య కుటుంబసభ్యులు శోకసంద్రంలో మునిగారు. తండాలోనే పాఠశాల ఉంటే తమ కుమారుడికి ఈ పరిస్థితి వచ్చేది కాదని వాపోయారు.

ఈ విషయంపై తండావాసులు మాట్లాడుతూ తండాలో ఉన్న పాఠశాలకు ఉపాధ్యాయుడిని కేటాయించకపోవడంతోనే తండా నుంచి పదుల సంఖ్యలో విద్యార్థులు ఇతర పాఠశాలలకు వెళ్లి చదువుకుంటున్న దుస్థితి నెలకొందని అన్నారు. తండాలో ప్రాథమిక పాఠశాల భవనం ఉన్నా తండాకు కేటాయించిన ఉపాధ్యాయుడిని డిప్యూటేషన్‌పై ఇతర పాఠశాలలకు కేటాయించడంతో పాఠశాల కొన్నేళ్ల క్రితమే మూతపడిందని ఈ విషయంపై పలుమార్లు మండల సర్వసభ్య సమావేశంలో సైతం చర్చించామని సర్పంచ్ కొముదమ్మ అన్నారు. పాఠశాల తిరిగి ప్రారంభం కాకపోవడంతో తండా నుంచి చిన్నారులు ఏకంగా 9 కి.మీ.దూరంలో ఉన్న రాయికల్ ప్రభుత్వ పాఠశాలకు వెళ్లి చదువుకుంటున్నట్లు తెలిపారు.

రైలుఢీకొని వృద్ధురాలు మృతి

దేవరకద్ర రూరల్: రైలు ఢీకొని వృద్ధురాలు మృతి చెందిన ఘటన ఘటన సోమవారం పట్టణంలో చోటు చేసుకుంది. రైల్వే ఎస్‌ఐ సయ్యద్ అక్బర్ తెలిపిన వివరాల మేరకు.. పట్టణ సమీపంలోని 63/22 గేటు వద్ద రైలు ఢీకొని గుర్తు తెలియని వృద్ధురాలు మృతి చెందినట్లు గమనించిన స్థానికులు రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని జిల్లా కేంద్రంలోని ఆస్పత్రికి తరలించారు. ఎటువంటి ఆధారాలు లభించలేదని, మృతురాలి వయస్సు 65 ఉండొచ్చని, సమాచారం తెలిస్తే తెలపాలని రైల్వే ఎస్‌ఐ కోరారు.

మహిళ మెడ నుంచి గొలుసు అపహరణ

లింగాల: ముసుగులు ధరించిన వ్యక్తులు మహిళ మెడ నుంచి బంగారు గొలుసు అపహరించిన ఘటన సోమవారం ఉదయం అవుసలికుంటలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన ర్యాక అంజమ్మ ఉదయం పాలు తీసుకురావడానికి ఇంటి నుంచి బయటకు వెళ్లింది. ద్విచక్రవాహనంపై ముసుగులు ధరించిన ఇద్దరు వ్యక్తులు ఆమె వద్ద వాహనాన్ని ఆపి దొర ఇల్లు ఎక్కడని అడిగారు. చిరునామా చెప్పేలోపే మహిళ మెడలో ఉన్న రెండు తులాల బంగారు గొలుసు లాక్కుని అంబట్‌పల్లి వైపు వెళ్లారు. బాధిత మహిళ అరవడంతో చుట్టుపక్కల వారు వచ్చే లోపు వాహనంపై పరారయ్యారు. బాధిత మహిళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు.

ప్రభుత్వ ఉపాధ్యాయుడికి జైలు శిక్ష

గద్వాల క్రైం: ప్రభుత్వ ఉపాధ్యాయుడిని సోమవారం రిమాండ్‌కు తరలించినట్లు రూరల్ ఎస్‌ఐ ఆనంద్ తెలిపారు. గద్వాల పట్టణానికి చెందిన వై.వెంకటేశ్వర్లు మండలంలోని ఓ ప్రభుత్వ ప్రైమరీ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. నాలుగు రోజుల క్రితం పాఠశాలలోని విద్యార్థులతో అసభ్యంగా వ్యవహరించినట్లు వారి తల్లిదండ్రులు తెలిపారు. ఈ మేరకు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోక్సో కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పట్టుబట్టి.. విజయం

- అలంపూర్‌లో మరోసారి 'చల్లా' మార్క్
- ఎన్నికల్లో సామాన్యుడికి వరించిన విజయం
- బీఆర్‌ఎస్ టికెట్‌కు పట్టుబట్టిన ఎమ్మెల్సీ
- సిట్టింగ్‌ను కాదని విజయుడికి బీఫాం

అలంపూర్: రాజకీయాల్లో రాణించడం కత్తిమీద సాములాంటిది. రాజకీయాల్లో సుస్థిర స్థానం దక్కించుకోవడానికి నిరంతరం శ్రమించాల్సి ఉంటుంది. రాజకీయాల్లో రెండు దశాబ్దాలుగా తమ పట్టు సడలకుండా ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి తన మార్క్‌ను మరోసారి నిరుపించుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ గాలి వీచినప్పటికి తమ మద్దతుదారుడిగా ఉన్న విజయుడిని అసెంబ్లీ ఎన్నికల్లో భారీ మెజార్టీతో విజయం దక్కించుకున్నారు. ప్రత్యక్ష ఎన్నికల్లో చల్లా పోటీలో లేనప్పటికి తన మద్దతుదారులను బరిలో దించి వరుసగా విజయాలు సాధించడం ఈ ప్రాంతంలో ఆయనకు ఉన్న పట్టుకు నిదర్శనం. నాలుగు ఎన్నికల్లో ఒకటి మినహా మిగిలిన మూడు సార్లు తన మద్దతు ఇచ్చిన అభ్యర్థులు విజయం సాధించడంతో చల్లా అభిమానులు ఆనందోత్సవాల్లో మునిగిపోతున్నారు.

2004 నుంచి పట్టువదలనివ్వకుండా..

2002లో చల్లా వెంకట్రామిరెడ్డి రాజకీయాల్లో ఆరంగేట్రం చేశారు. అప్పటి పరిస్థితుల్లో ఆయన తన స్వగ్రామైన పుల్లూరు సర్పంచ్‌గా బరిలో నిలుచున్నారు. ఆ తర్వాత 2004లో జనరల్‌గా ఉన్న అసెంబ్లీ స్థానం నుంచి కాంగ్రెస్ టికెట్ ఆశించారు. అప్పటి కాంగ్రెస్, టీఆర్‌ఎస్ పొత్తు కారణంగ సిట్టింగ్‌కు ఈ టికెట్ కేటాయించారు. దీంతో అసెంబ్లీ బరిలో ఉండాలనే ఉద్దేశంతో స్వతంత్రంగా పోటీ చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్ రాజశేఖర రెడ్డి ప్రభంజనంలో కాంగ్రెస్ గాలి వీచినా ఇక్కడ స్వతంత్రంగా పోటీచేసిన చల్లాను విజయం వరించింది. అప్పటి నుంచి జైత్రయాత్ర కొనసాగిస్తూ వస్తున్నారు. నియోజకవర్గాల పునర్విభజనతో జనరల్‌గా ఉన్న అలంపూర్ ఎస్సీ స్థానంగా మారింది.


కర్నూల్‌లోని చల్లా నివాసం వద్ద అభిమానుల కోలాహలం


అలంపూర్ ఆలయాల్లో అనుచరులతో చల్లా వెంకట్రామిరెడ్డి, విజయుడు

దీంతో 2009, 2014 అసెంబ్లీ ఎన్నికల్లో తన మద్దతుదారుల విజయానికి కృషి చేసి తన మార్క్‌ను కొనసాగించారు. 2018లో అదే స్థాయిలో మద్దతు పలికినప్పటికి విజయం దక్కలేదు. కానీ ఈ సారి అసెంబ్లీ ఎన్నికల్లో విజయం ఆయన ఖాతాలోనే పడింది.

పట్టుబట్టి బరిలో నిలిపి..

బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ఈ సారి అసెంబ్లీ ఎన్నికల్లో సిట్టింగ్‌లకే బరిలో నిలిచే అవకాశం ఇచ్చారు. ఇక్కడ సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న డాక్టర్ అబ్రహంను అభ్యర్థిగా ప్రకటించారు. పార్టీలో ఎమ్మెల్సీగా ఉన్న చల్లా వెంకట్రామిరెడ్డి తన మద్దతుదారుడికి టికెట్ ఇప్పించడానికి ప్రయత్నించారు. ఎన్నికల ముందు రాష్ట్ర వ్యాప్తంగా ప్రకటించిన అభ్యర్థులకు బీఫాం ఇవ్వగా అలంపూర్ బీఫాంలో దోబూచులాట సాగింది. ఒక వైపు ఎమ్మెల్సీ మరో వైపు సిట్టింగ్ ఉన్న అబ్రహం బీఫాం కోసం తీవ్రంగా ప్రయత్నించడంతో అనిశ్చితి నెలకొంది. చివరకు బీఆర్‌ఎస్ అధిష్టానం ఎమ్మెల్సీ చల్లా వైపు మొగ్గు చూపడంతో ముందుగా ప్రకటించిన సిట్టింగ్ ఎమ్మెల్యేకు కాకుండా విజయుడికి బీఫాం దక్కింది. దీంతో స్థానికంగా రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతూవచ్చాయి.

మిన్నంటిన సంబరాలు

బీఆర్‌ఎస్ అభ్యర్థి విజయుడు విజయఢంకా మోగించడంతో చల్లా శ్రేణులు సంబరాల్లో మునిగిపోయారు. ఫలితాల్లో ఆది నుంచి ఆధిపత్యాన్ని ప్రదర్శించి విజయాన్ని అందుకోవడంతో ఆనందోత్సవాల్లో మునిగిపోయారు. నియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లో కార్యకర్తలు, అభిమానులు సంబరాలు చేసుకున్నారు. కర్నూల్‌లోని నివాసంలో ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డిని ఆయా మండలాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

సర్వశక్తులు ఒడ్డి

అసెంబ్లీ ఎన్నికల్లో విజయాన్ని దక్కించుకోవడానికి బరిలో నిలిచిన అభ్యర్థులు సర్వశక్తులు ఒడ్డారు. బీఆర్‌ఎస్ అభ్యర్థిగా బరిలో నిలిచిన విజయుడికి ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి అంతా తానై నడిపించారు. ఈ సారి విజయాన్ని ఎలాగైన దక్కించుకోవడానికి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో నిలిచిన సంపత్ కుమార్ ప్రయత్నించారు. టికెట్ల మార్పుతో మారిన రాజకీయ సమీకరణాల్లో అసంతృప్తులుగా ఉన్న సిట్టింగ్ ఎమ్మెల్యే అబ్రహం, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ అధికార ప్రతినిధిగా ఉన్న మందా జగన్నాథం, ఆయన తనయుడు మందా శ్రీనాథ్‌లను కాంగ్రెస్‌లో చేర్చుకోవడంలో సంపత్ కుమార్ సఫలమయ్యారు. వీరితోపాటు మాజీ ఎమ్మెల్యే కొత్తకోట ప్రకాష్‌రెడ్డి, ఇతర నాయకులతో కలిసి ప్రచారం రక్తికట్టించారు. కానీ ఒక్కడిగా ఉన్న విజయుడికి అన్నీ తానై చల్లా ప్రచారం కొనసాగించారు. చివరకు ఫలితాల్లో ఓటర్లు చల్లా మద్దతుదారిడికి జై కొట్టారు. హోరాహోరీగా పోటీ ఉంటుందని భావించిన ఫలితాల్లో సైతం సునాయసంగా విజయుడికి విజయం దక్కింది. దీంతో చల్లా నియోజకవర్గంలో తనదైన శైలీలో రాజకీయ చతురతతో విజయాలను అందుకుంటు స్థానాన్ని సుస్థిరం చేసుకున్నారు.

'చే'జిక్కింది..

- తొలి ప్రయత్నంలోనే విజేతగా నిలిచిన తూడి మేఘారెడ్డి
- నియోజకవర్గంలో మొదటి ప్రయత్నంలో గెలిచిన జాబితాలో ఏడో వ్యక్తి

వనపర్తి: నియోజకవర్గంలో తొలి ప్రయత్నంలోనే ఎమ్మెల్యేగా గెలుపొందిన జాబితాలో తాజా ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ఏడో వ్యక్తిగా నిలిచారు. 1952 నుంచి ఇప్పటి వరకు 17 సార్లు అసెంబ్లీ ఎన్నికలు జరగగా.. మొదటి మూడు ఎన్నికల్లో తొలి ప్రయత్నం చేసిన వారే విజేతలయ్యారు. అనంతరం వనపర్తి సంస్థాన కుటుంబసభ్యురాలు రాణి కుముదినీదేవి, కొత్తకోటకు చెందిన పి.అయ్యప్ప, రావుల చంద్రశేఖర్‌రెడ్డి పేర్ల సరసన ఈ ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలుపొందిన కాంగ్రెస్ అభ్యర్థి తూడి మేఘారెడ్డి పేరు నమోదైంది. బీఆర్‌ఎస్ పార్టీ నుంచి ఎంపీటీసీగా గెలుపొంది ఎంపీపీ పదవి అధిరోహించారు. అనంతరం మంత్రి నిరంజన్‌రెడ్డితో విభేదించి ఈ ఏడాది మార్చిలో పలువురు నాయకులతో కలిసి పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరి పట్టుబట్టి ఎమ్మెల్యే టికెట్ దక్కించుకొన్నారు. ఎవరూ ఊహించని రీతిలో 25,370 భారీ మెజార్టీతో విజయం సాధించారు.


వనపర్తిలో కాంగ్రెస్ విజయోత్సవ ర్యాలీ

మంత్రిగా పనిచేసి ఓటమి పాలైన రెండోవ్యక్తి..

2004 ఎన్నికల్లో గెలుపొందిన డా. చిన్నారెడ్డి 2008లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్ రెడ్డి కేబినెట్‌లో డా. జి.చిన్నారెడ్డి మొదటిసారి మంత్రి పదవి దక్కించుకున్నారు. అనంతరం 2009 ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. మళ్లీ పదేళ్ల తర్వాత 2018 ఎన్నికల్లో గెలుపొందిన సింగిరెడ్డి నిరంజన్ రెడ్డికి మంత్రి పదవి దక్కింది. 2023 ఎన్నికల్లో ఓటమి పాలవడం గమనార్హం.

నిరంజన్‌రెడ్డి ఓటమికి కారణాలెన్నో..

- బీఆర్‌ఎస్ పాలనపై వ్యతిరేకతా.. 'చేతి' వాటమా?

తెలంగాణా ఆవిర్భావం నుంచి రెండుదఫాలు జరిగిన ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. 2014లో వనపర్తి నియోజకవర్గం నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీచేసిన నిరంజన్‌రెడ్డి కాంగ్రెస్ అభ్యర్థి చిన్నారెడ్డి చేతిలో ఓడిపోయారు. అయినా ముఖ్యమంత్రి కేసీఆర్‌తో ఉన్న చొరవతో మంత్రి హోదాకు సమానమైన రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడి పదవి దక్కించుకున్నారు. సాగునీటిపై దృష్టి సారించి అభివృద్ధి నినాదంతో 2018 ఎన్నికల్లో 51,685 ఓట్ల భారీ మెజార్టీతో గెలుపొంది రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రిగా కొనసాగారు. రాష్ట్రవాప్తంగా బీఆర్‌ఎస్ పాలనపై వ్యతిరేకత.. కాంగ్రెస్ గాలి ఏదేమైనా 2023 ఎన్నికల్లో ఎవరూ ఊహించని విధంగా ఓటమి పాలయ్యారు.

నా అనుకున్న వారే చేయిచ్చారా?

రాష్ట్రంలో అత్యధిక అభివృద్ధి చెందిన జిల్లాల జాబితాలో వనపర్తిని నిలిపిన తాజా మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఓటమి కారణాలు అనేకం వినిపిస్తున్నాయి. ముఖ్యంగా సొంతపార్టీలోని కీలక నాయకుల్లో కొందరు చేయిచ్చారనే అంశం ఆ పార్టీ శ్రేణుల్లో బలంగా వినిపిస్తోంది. ఈ విషయంపై మాజీ మంత్రి విశ్లేషణ చేస్తున్నట్లు తెలుస్తోంది. చేసిన అభివృద్ధే తనను గెలిపిస్తుందనే నమ్మకంతో క్షేత్రస్థాయిలో ఏం జరుగుతుందనే విషయంపై దృష్టి సారించకపోవడం.. గత ఎన్నికల్లో చక్రం తిప్పిన అభిలాష్‌రావులాంటి కుడి భుజం లేకపోవటం కలిసి రాలేదనే వాదన స్థానికంగా వినిపిస్తోంది.

విజయోత్సవ ర్యాలీలో అపశృతి

గుండెపోటుతో యువకుడు మృతి

ఊట్కూరు: మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు ఆదివారం రాత్రి నిర్వహించిన విజయోత్సవ ర్యాలీలో అపశృతి చోటు చేసుకుంది. ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. కాంగ్రెస్ అభ్యర్థి వాకిటి శ్రీహరి ఎమ్మెల్యేగా గెలుపొందడంతో ఆదివారం రాత్రి విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. డీజే బాక్సులతో యువకులు పటాసులు కాలుస్తూ గ్రామ పురవీధుల్లో ర్యాలీ చేపట్టారు. మండల కేంద్రానికి చెందిన పార్ల రషీద్(35) ర్యాలీలో పాల్గొని నృత్యాలు చేశాడు. రాత్రి 10 గంటల సమయంలో అతడు అస్వస్థతకు గురికావడంతో హుటాహుటిన నారాయణపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. విషయం తెలుసుకున్న పార్టీ నాయకులు సోమవారం మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. బాలకిష్టారెడ్డి, రవికుమార్ యాదవ్, గోపాల్‌రెడ్డి, హరి, అబ్దుల్ ఖాదర్, యజ్ఞేశ్వర్‌రెడ్డి, వెంకటేష్‌గౌడ్ తదితరులు కుటుంబాన్ని పరామర్శించి బాధిత కుటుంబాన్ని ఆదుకుంటామని హామీ ఇచ్చారు.


అబ్దుల్ రషీద్ (ఫైల్)

దేవరకద్ర, పేటలో హస్తం పాగా

దేవరకద్ర: పాలమూరు ఉమ్మడి జిల్లాలోని దేవరకద్ర, నారాయణపేటలో కాంగ్రెస్ పార్టీ తొలిసారి పాగా వేసింది. కాంగ్రెస్ అభ్యర్థులు దేవరకద్రలో జి.మధుసుదన్‌రెడ్డి, నారాయణపేటలో చిట్టెం పర్ణికారెడ్డి విజయం సాధించారు. మహబూబ్‌నగర్ జిల్లాలో గతంలో 13శాసనసభ స్థానాలు ఉండగా, నియోజకవర్గాల పునర్విభజన తర్వాత అమరచింత నియోజకవర్గాన్ని రద్దు చేసి దేవరకద్ర, నారాయణపేట ఏర్పాటు చేశారు. పునర్విభజన తర్వాత 2009లో దేవరకద్రలో టీడీపీ నుంచి సీతా దయాకర్‌రెడ్డి, కాంగ్రెస్ నుంచి ప్రస్తుత జెడ్పీచైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డిపై గెలిచారు. అదేవిధంగా నారాయణపేటలో టీడీపీ నుంచి ఎల్కోటి ఎల్లారెడ్డి, కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన సూగప్పపై గెలుపొందారు. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత 2014, 2016 వరుసగా టీఆర్‌ఎస్ నుంచి ఆల వెంకటేశ్వర్‌రెడ్డి విజయం సాధించారు. 2014లో నారాయణపేటలో టీడీపీ నుంచి రాజేందర్‌రెడ్డి, టీఆర్‌ఎస్ అభ్యర్థి శివకుమార్‌రెడ్డిపై గెలిచారు. ఆ తర్వాత రాజేందర్‌రెడ్డి టీఆర్‌ఎస్‌లో చేరారు. దీంతో శివకుమార్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరారు. 2018లో కాంగ్రెస్ అధిష్టానం శివకుమార్‌రెడ్డికి టికెట్ ఇవ్వలేదు. ఆయన 2018లో బీఎల్‌ఎఫ్ నుంచి పోటీ చేసినా రాజేందర్‌రెడ్డి చేతిలో మళ్లీ ఓడిపోయారు.

జూరాలకు స్వల్పంగా పెరిగిన ఇన్‌ఫ్లో

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లోలు స్వల్పంగా పెరిగినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. సోమవారం రాత్రి 7గంటల వరకు ప్రాజెక్టుకు కేవలం 3,271 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. ఆవిరి రూపంలో 89, ఎడమ కాల్వకు 390, కుడి కాల్వకు 338 క్యూసెక్కులు ప్రాజెక్టు నుంచి మొత్తం 817 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 7.952 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

పోలింగ్‌పై పోస్టుమార్టం

- ఫలితాల సమీక్షలో అభ్యర్థులు
- ఓట్లు తక్కువ రావడంపై కారణాల విశ్లేషణ
- అచ్చంపేటలో 8మండలాల్లో హస్తం జోరు



అచ్చంపేట: పట్టణంతో పాటు గ్రామం, వార్డు, మండలంలో, బూత్‌లోఎన్ని ఓట్లు వచ్చాయి? ఎందుకు తక్కువ పడ్డాయి? ఇందుకు గల కారణాలు ఏమిటీ? అంటూ ఎన్నికల ఫలితాలు సమీక్షలో గెలిచిన, ఓడిన అభ్యర్థులు మునిగిపోయారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిన 'గులాబీ' అభ్యర్థులు హైదరాబాద్‌లో జరిగిన సమావేశం, ఇతర సమావేశాల్లో తలమునకలైయ్యారు. ముఖ్య అనుచరులు ఫలితాలపై పోస్టుమార్టం నిర్వహించారు. అచ్చంపేట నియోజకవర్గంలో 8మండలాల్లో హస్తం జోరు కొనసాగింది.

విశ్లేషణలో నిమగ్నం..

ఎన్నికల్లో గెలుపోటములపై అభ్యర్థులు, రాజకీయ నాయకులు, కార్యకర్తలు దృష్టి సారించారు. గెలిచిన అభ్యర్థులు ఎందుకు మెజార్టీ తగ్గింది. ఏ బూత్‌లో తక్కువ పడ్డాయో ఆరా తీస్తున్నారు. ఓడిన అభ్యర్థులు బలహీనతకు కారణాలేమిటో అంచనా వేస్తున్నారు. ప్రభావితం చేసిన చోట ఓట్లు రాలాయా, లేదా అని పరిశీలిస్తున్నారు. అంచనా మేరకు ఓట్లు బదిలీ జరిగాయా? లేదా అని పోలింగ్ బూత్‌ల వారీగా పరిశీలిస్తున్నారు. ఒకతాటిపైకి తీసుకురావటానికే సరిపోయిందని ఇది కూడా బీఆర్‌ఎస్ ఓటమికి కారణంగా కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

లెక్కలో కాంగ్రెస్ పక్కా.. బీఆర్‌ఎస్ విఫలం..

నాగర్‌కర్నూల్ జిల్లాలో ఆదివారం నిర్వహించిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు సీనియర్ నేతలకు చేదు అనుభవాన్ని మిగిల్చాయి. అచ్చంపేట బీఆర్‌ఎస్ అభ్యర్థి గువ్వల బాలరాజు ఎన్నికల్లో మొదటి సారి ఓటమిని చవి చూశారు. 2009 పార్లమెంట్ ఎన్నికల్లో మహాకూటమి నుంచి పోటీ చేసి ఓడిన ఆయన 2014, 2018 అసెంబ్లీ ఎన్నికల్లో అప్పటి టీఆర్‌ఎస్ నుంచి విజయం సాధించారు. ఈఎన్నికల్లో బీఆర్‌ఎస్ గెలుపు ఖాయమని విస్తృత ప్రచారం జరిగింది. ప్రజల తీర్పు మాత్రం ఎవరికి అర్థం కాని తరహాలో కాంగ్రెస్‌కు పట్టం కట్టారు. ఈ ఎన్నికల్లో వంశీకృష్ణకు 49,326 మెజార్టీతో చరిత్రను తిరగరాశారు. గువ్వల బాలరాజుపై ఉన్న వ్యతిరేకత వల్లే ఈమెజార్టీ సాధ్యమైందని ఈ ప్రాంత వాసులు చర్చించుకుంటున్నారు.

పనిచేసిన ఫార్ములా..


గత అనుభవాలతో సీనియర్ నేతలు, అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, ఓటర్లను తనవైపు తిప్పుకోవడంలో డాక్టర్ వంశీకృష్ణ ఫార్ములా పనిచేసింది. 2004 గెలుపుతో పాటు 2009, 2014, 2018 వరుస ఓటమిల అనుభవం ఈ ఎన్నికల్లో అనుచరించాల్సిన విధానంపై వ్యూహంతో ముందుకు వెళ్లారు. పక్కా వ్యూహం అవలభించడం వల్లే అత్యధిక మెజార్టీతో గెలుపొందారని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

పనిచేసిన గోబ్యాక్ నినాదం..

అచ్చంపేట నియోజకవర్గం నుంచి పోటీ చేసిన బీఆర్‌ఎస్ అభ్యర్థి గువ్వల బాలరాజు ఈ ప్రాంత వాసి కాకపోవడంతో ఆయన సొంత గ్రామానికి పంపించాలనే నినాదం రెండు పర్యాయాల తర్వాత పని చేసింది. ఆయన స్వగ్రామం గోపాల్‌పేట మండలం పొల్కెపాడు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఇక్కడి వచ్చి జైతెలంగాణ నినాదంతో ఈ ప్రాంత ప్రజలకు పరిచయమయ్యారు. 2009లో టీడీపీతో పొత్తు కారణంగా టీఆర్‌ఎస్ టికెట్ రాకపోవడంతో నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నుంచి పోటీ చేసి ఓడిపోయారు. రాష్ట్రం ఏర్పాటు తర్వాత 2014, 2018లో టీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి రెండుసార్లు అసెంబ్లీకి వెళ్లారు. ప్రభుత్వ విప్‌గా పనిచేశారు. ఈ ప్రాంత ఎమ్మెల్యేగా ప్రజల నడుమ ఉంటూనే వ్యవహారశైలి బాగాలేదనే వ్యతిరేకత మూటకట్టుకున్నారు. దీన్నే కాంగ్రెస్ నాయకులు ప్రచార అస్త్రంగా ఉపయోగించుకున్నారు. స్థానికేతరుడు, వలస నాయకత్వానికి ఓటు ద్వారా బుద్ధి చెప్పాలన్న నినాదం పనిచేసింది.

మండలాల వారీగా పోలైన ఓట్లు

మండలం	బీఆర్‌ఎస్	కాంగ్రెస్	బీజేపీ	ఆధిక్యం
చారకొండ	4,271	5,940	197	1,669
వంగూరు	9,667	15,496	698	5,829
ఉప్పునుంతల	9,194	14,347	573	5,153
అచ్చంపేట టౌన్	3,940	8,953	456	5,013
అచ్చంపేట మండలం	11,018	17,548	544	6,530
బల్మూర్	8,806	15,853	787	7,047
లింగాల	7,986	13,624	385	5,638
అమ్రాబాద్	6,292	14,006	405	7,714
పదర	4,487	8,044	156	3,557
పోస్టల్ బ్యాలెట్	350	1,576	66	1,226
మొత్తం	66,011	1,15,337	4,267	49,326



కంది సాగులో సస్యరక్షణ


కంది పంటకు ఆశించిన మారుక మచ్చల పురుగు, మారుక పురుగు ఆశించి దెబ్బతిన్న కాయలు

అలంపూర్: కంది పంటలో సస్యరక్షణ పాటించి పంటలను కాపాడుకోవాలని వ్యవసాయ శాఖ ఏడీఏ సక్రియ నాయక్ రైతులకు సూచించారు. సాగు చేసిన కంది పూత, పిందె దశలో ఉండటంతో పంటలకు మారుక (బియ్యం పురుగు), పచ్చపురుగు ఆశిస్తుందని పేర్కొన్నారు. ఈ పురుగుతో పూత, పిందె దశలో ఉన్న పంటలకు అపార నష్టాన్ని కలిగిస్తాయని తెలిపారు. రైతులు ముందస్తు జాగ్రత్తతో వాటి నివారణ పద్ధతులు అవలంభిస్తే పంటను కాపాడుకోవచ్చని వివరించారు.

అధికారి సలహా
వ్యవసాయ శాఖ ఏడీఏ సక్రియ నాయక్

మారుక మచ్చల పురుగు (బియ్యం పురుగు)

మారుక మచ్చల పురుగు లేత పిందెలు, పూతను చుట్టగా చేసుకోని పూతను పూర్తిగా తింటూ పంటకు నష్టం చేస్తోంది. ఈ పురుగు వల్ల ఫలదీకరణ దెబ్బతిని కాయలు కాకుండా చేస్తోంది. దీంతో పంట దిగుబడిపైనే తీవ్ర ప్రభావం చూపుతుంది.

మారుక మచ్చ పురుగు నివారణ

మారుక మచ్చల పురుగుతో పంటకు నష్టం జరిగే ప్రమాదం ఉండటంతో రైతులు నివారణ చర్యలు తీసుకోవాలి. థయోడికార్బ్‌ను గ్రాము లేదా స్పినోసాడ్ 0.3 మీ.లీ. లేదా ఫ్లూబెండమయడ్ 0.3 మీ.లీ మందును రెనాక్సీపైర్ 0.3 మీ.లీ లీటర్ నీటిలో కలిపి, నువాన్ 1 మి.లీ. మందును లీటర్ నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలి. దీంతో పిచికారి చేసిన మందు చుట్టలోపల ఉన్న మారక పురుగును నాశనం చేస్తోంది.

పచ్చపురుగు

తల్లిపురుగు బంగారు రంగు గల గుడ్లను లేత పిందె, పూత మీద వేయడం జరుగుతుంది. ఈ గుడ్ల ద్వారా ఆశించిన పురుగులు పూతను, పిందెను, కాయలను తొలుచును. వీటి నివారణకు చర్యలు తీసుకోవడంలో జాప్యం చేస్తే కాయలను ఆమాంతం నాశనం చేస్తుంది.

పోషకాలను అందించాలి

ప్రస్తుతం పూత, పిందె దశలో ఉన్న పంటకు పోషకాలను అందించాల్సి ఉంటుంది. అయితే పోషకాలను ఆకుల ద్వారా అందించాలి. 14:0:35 ఐదు గ్రాములను లీటర్ నీటిలో కలిపి పిచికారి చేసుకోవడంతో పంటకు మంచి పోషకాలు అందుతాయన్నారు.

క్లుప్తంగా...

ఐదు జిల్లాల్లో దుర్గమ్మ ప్రచార రథయాత్ర

ఈ నెల 6న ప్రారంభం..
24న ముగింపు

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై వేంచేసిన శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల ఉత్సవ మూర్తులతో ఐదు జిల్లాల్లో ప్రచార రథయాత్ర నిర్వహించేందుకు దేవస్థానం నిర్ణయం తీసుకుంది. శోభకృత నామ సంవత్సర భవానీ దీక్షలను పురస్కరించుకుని ఈ నెల 6వ తేదీ నుంచి 24వ తేదీ వరకు దుర్గమ్మ ప్రచార రథయాత్ర అనంతపురం జిల్లా, శ్రీసత్యసాయి జిల్లా, వైఎస్సార్ కడప జిల్లా, అన్నమయ్య జిల్లా, శ్రీకాకుళం జిల్లాలో సాగనుంది. ఈ మేరకు రూట్‌మ్యాప్‌ను ఆలయ వైదిక కమిటీ నిర్ణయించి ఈవో కె.ఎస్.రామారావుకు అందజేసింది. ప్రచార రథయాత్రలో నిత్యం ఆది దంపతులకు గ్రామోత్సవం నిర్వహిస్తారు. ఆయా ప్రాంతాల్లో చండీ హోమం, కుంకుమార్చనతో పాటు శాంతి కల్యాణం నిర్వహించేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. ప్రచార రథ యాత్రపై ఇప్పటికే ఆయా జిల్లాల్లోని గ్రామపెద్దలు, గురు భవానీలు, భక్త సమాజాలకు సమాచారం ఇచ్చారు. ఆయా గ్రామాల్లో గ్రామోత్సవంతో పాటు పలు వైదిక కార్యక్రమాలను నిర్వహించేందుకు వైదిక కమిటీ నిర్ణయించింది.

ఎస్టీపీపీలో విద్యుత్ ఉత్పత్తికి బ్రేక్..



జైపూర్: మంచిర్యాల జిల్లా జైపూర్ మండల కేంద్రంలోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ యూనిట్-1, యూనిట్-2లో విద్యుత్ ఉత్పత్తి పూర్తిగా నిలిచిపోయింది. యూనిట్-1లో పలు సాంకేతిక కారణాలతో గత నెల 20 నుంచి విద్యుత్ ఉత్పత్తి నిలిపివేసి మరమ్మతు చేస్తున్నారు. యూనిట్-2లో ట్యూబ్ లీకేజీల కారణంగా ఈ నెల ఒకటి నుంచి విద్యుత్ ఉత్పత్తి నిలిపివేయడంతో రెండు యూనిట్లల్లోనూ ఉత్పత్తి పూర్తిగా స్తంభించింది. యూనిట్-2 నుంచి విద్యుత్ ఉత్పత్తికి అధికార యంత్రాంగం అంతా రాత్రింబవళ్లు శ్రమిస్తుండగా మంగళవారం నాటికి ప్రారంభించనున్నట్లుగా తెలుస్తోంది. కాగా, ఒక్కో యూనిట్ నుంచి సుమారు 13.6 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. ఈ లెక్కన రెండు యూనిట్లలో ఉత్పత్తి నిలిచిపోవడంతో రోజుకు సుమారు రూ.14 కోట్లకుపైగా నష్టం వాటిల్లుతోంది.

24% పెరిగిన సైబర్ నేరాలు

సాక్షి, హైదరాబాద్: దేశంలో సైబర్ నేరాల నమోదు ఏటా పెరుగుతోంది. 2021తో పోలిస్తే దేశవ్యాప్తంగా సైబర్ నేరాల నమోదు 2022లో 24.4 శాతం పెరిగినట్లు జాతీయ నేర గణాంకాల బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ)-2022 నివేదిక వెల్లడించింది. సైబర్ నేరాల నమోదులో దేశంలోనే తెలంగాణ తొలి స్థానంలో నిలిచిందని పేర్కొంది. 2021తో పోలిస్తే 2022లో సైబర్ నేరాల నమోదు తెలంగాణలో 40 శాతం పెరిగిందని వివరించింది. అదే సమయంలో దేశవ్యాప్తంగా అన్ని రకాల నేరాల నమోదు 4.5 శాతం తగ్గినట్లు నివేదిక తెలిపింది. ఎన్‌సీఆర్‌బీ-2022 వార్షిక నివేదికను కేంద్ర హోంశాఖ సోమవారం విడుదల చేసింది. ఏటా జూలై లేదా ఆగస్టు వరకు ఈ నివేదిక విడుదల చేస్తుండగా ఈసారి ఎన్‌సీఆర్‌బీ నివేదిక విడుదలలో దాదాపు 5 నెలలపాటు జాప్యమైంది.

58.24 లక్షల కేసులు...

ఎన్‌సీఆర్‌బీ తాజా నివేదిక ప్రకారం ఐపీసీ, స్పెషల్ లోకల్ లా (ఎస్ఎల్ఎల్) సెక్షన్ల కింద కలిపి 2021లో మొత్తం 60,96,310 కేసులు నమోదవగా 2022లో అన్ని రకాల నేరాలు కలిపి 4.5 శాతం తగ్గుదలతో 58,24,946 కేసులు నమోదయ్యాయి. ప్రతి లక్ష మందికి నేరాల నమోదు పరిశీలిస్తే 2021లో 445.9 నేరాలు నమోదుకాగా 2022లో ఆ సంఖ్య 422.2కు తగ్గింది. దేశవ్యాప్తంగా మహిళలపై నేరాల్లో 4 శాతం, చిన్నారులపై నేరాల్లో 8.7 శాతం, వృద్ధులపై నేరాల్లో 9.3 శాతం, ఎస్సీలపై నేరాల్లో 13.1 శాతం, ఎస్టీలపై నేరాల్లో 14.3 శాతం, ఆర్థిక నేరాల్లో 11.1 శాతం పెరుగుదల నమోదైంది. అదే సమయంలో తెలంగాణలో ఐపీసీ, ఎస్ఎల్ఎల్ చట్టాల కింద నమోదైన అన్ని రకాల కేసుల నమోదు చూస్తే కేసుల నమోదు సంఖ్య పెరిగింది.

2022లో దేశవ్యాప్తంగా 65,893 సైబర్ కేసుల నమోదు

- సైబర్ నేరాల నమోదులో 40 శాతం పెరుగుదలతో మొదటి స్థానంలో తెలంగాణ
- దేశవ్యాప్తంగా మహిళలపై నేరాల్లో 4 శాతం పెరుగుదల.. అన్ని నేరాల్లో 4.5 శాతం తగ్గుదల
- జాతీయ నేర గణాంకాల బ్యూరో-2022 నివేదిక వెల్లడి



2021లో 1,58,809 కేసులు నమోదవగా 2022లో రాష్ట్రవ్యాప్తంగా 1,65,830 కేసులు నమోదయ్యాయి. రాష్ట్రంలో 2022లో నమోదైన కేసుల్లో 79.7 శాతం కేసులలో చార్జిషీట్లు దాఖలయ్యాయి.

రాష్ట్రంలో సైబర్ క్రైం పైపైకి...

తెలంగాణలో 2022లో మొత్తం 15,272 సైబర్ నేరాలు నమోదవగా 2021లో మొత్తం 10,303 కేసులు నమోదైనట్లు నివేదిక వెల్లడించింది. 2021తో పోలిస్తే తెలంగాణలో 2022లో 40 శాతం మేర సైబర్ కేసులు నమోదు పెరిగినట్లు తెలిపింది. దేశవ్యాప్తంగా 2022లో మొత్తం 65,893 సైబర్ నేరాలు నమోదుకాగా, 2021లో 52,974 కేసులు నమోదయ్యాయని ఎన్‌సీఆర్‌బీ నివేదిక తెలిపింది. 2021తో పోలిస్తే 2022లో సైబర్ నేరాలపై కేసుల నమోదు 24.4% పెరుగుదల ఉంది. 2022లో నమోదైన సైబర్ నేరాలను పరిశీలిస్తే 64.8 శాతం (42,710 కేసులు) సైబర్ నేరాలకు కారణం మోసం చేసే ఉద్దేశమని నివేదిక తేల్చింది. ఆ తర్వాతి స్థానంలో 5.5 శాతం (3,648 కేసులు) బెదిరింపులకు సంబంధించినవి, లైంగిక దోపిడీ కారణమైన సైబర్‌నేరాలు 5.2 శాతం (3,434 కేసులు) ఉన్నట్లు వెల్లడించింది. సైబర్ నేరాల నమోదులో తెలంగాణ తర్వాత స్థానంలో కర్ణాటక (18.6 శాతం), మహారాష్ట్ర (6.6 శాతం) ఉన్నాయి.

ఇతర నేరాలు ఇలా...

రాష్ట్రంలో మహిళలపై నేరాల సంఖ్య పెరిగింది. 2021లో 20,865 కేసులు నమోదవగా 2022లో అవి 22,066కు పెరిగాయి. మానవ అక్రమ రవాణా కేసులు 2022లో దేశవ్యాప్తంగా 2,250 కేసులు నమోదవగా 391 కేసుల నమోదుతో దేశంలోనే తెలంగాణ మొదటి స్థానంలో ఉన్నట్లు నివేదిక తెలిపింది. ఆ తర్వాత స్థానంలో మహారాష్ట్ర (295), బిహార్ (260) నిలిచాయి. హత్య కేసుల సంఖ్య 2022లో తెలంగాణలో తగ్గింది. 2021లో 1,026 హత్య కేసులు నమోదవగా 2022లో ఆ సంఖ్య 337కు తగ్గింది. వాటిలో వివాహేతర సంబంధాల కారణంగా 116 హత్యలు జరిగినట్లు నివేదిక వెల్లడించింది.

హైదరాబాద్‌లో బీఆర్'ఎస్' బయట కాంగ్రెస్

- ముస్లిం మైనారిటీ ఓటర్ల తీరులో మార్పు!
- క్షేత్రస్థాయి పరిశీలనలోనే గుర్తింపు.. పోస్ట్ పోల్ సర్వేలదీ అదే మాట

సాక్షి, హైదరాబాద్: దశాబ్ద కాలంగా బీఆర్ఎస్‌కు అండగా ఉంటూ వచ్చిన ముస్లిం మైనారిటీల తీరులో మార్పు వచ్చినట్టు తాజా ఎన్నికలు స్పష్టం చేస్తున్నాయి. మజ్లిస్ పోటీ చేసే స్థానాల్లో ఆ పార్టీకి ఏకపక్షంగా ఓట్లు వేస్తూ, మజ్లిస్ పోటీలో లేని స్థానాల్లో పూర్తిగా బీఆర్ఎస్ అభ్యర్థుల పక్షాన నిలిచే సంప్రదాయాన్ని పక్కన పెట్టినట్టు అవగతమవుతోంది. అయితే జంటనగరాలు, దాని శివారు ప్రాంత నియోజకవర్గాల్లో మాత్రం బీఆర్ఎస్‌నే ఆదరించారు. ఈ కారణంగానే కాంగ్రెస్ పార్టీ రాష్ట్రవ్యాప్తంగా హవా ప్రదర్శించినా జీహెచ్ఎంసీ పరిధిలో మాత్రం చేతులెత్తేసింది. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో మా త్రం ముస్లిం మైనారిటీలు.. ముందే చెప్పినట్లు సంప్రదాయాన్ని పక్కనబెట్టి కాంగ్రెస్ వైపు మొగ్గు చూపారు. ముస్లిం ఓటర్లు గణనీయ సంఖ్యలో ఉన్న నియోజకవర్గాల్లో ఆ పార్టీ అభ్యర్థులు విజయ దుందుభి మోగించారు. పోలింగ్ ముగిసిన తర్వాత ఇండియా టుడే నిర్వహించిన పోస్ట్ పోల్ సర్వేలో ఈ అంశాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించింది. హైదరాబాద్ వెలుపలి నియోజకవర్గాల్లో ముస్లింలు కాంగ్రెస్ పక్షాన నిలిచినట్లు వెల్లడించింది.

ఒవైసీ పిలుపును పట్టించుకోకుండా..

'ఒవైసీ హైదరాబాద్ నేత. ఆయన అభ్యర్థులు అక్కడే గెలుస్తారు. ఆ ప్రాంత ముస్లిం ఓటర్లను ఆయన ప్రభావితం చేస్తారు. కానీ మాకు ఒవైసీతో సంబంధం లేదు. బీఆర్ఎస్‌కు ఓటేయాలన్న ఆయన పిలుపును కాకుండా మా ప్రాంత పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని మేం నిర్ణయం తీసుకుంటాం. ఈసారి కాంగ్రెస్‌కే ఓటేయాలని నిర్ణయించుకున్నాం..'ఇది ఇటీవల క్షేత్ర పరిశీలనలో పరిగి, తాండూరు లాంటి ప్రాంతాల్లో ముస్లిం ఓటర్లు 'సాక్షి'తో చెప్పిన మాట. దానికి తగ్గట్టే ఇప్పుడు ఫలితాలు వచ్చాయి. ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లాల్లో ముస్లింల ప్రాబల్యం ఉన్న చోట్ల కాంగ్రెస్ గెలిచింది.

ఆ ప్రచారమే కారణమా?

'ముస్లింలలో సింహభాగం గతంలో కాంగ్రెస్ పక్షానే నిలిచేవారు. తెలంగాణ ఆవిర్భావం తర్వాత వారి తీరు మారింది. కేసీఆర్ ప్రభుత్వం ముస్లింల సంక్షేమానికి చర్యలు తీసుకోవటంతో వారు బీఆర్ఎస్ వైపు మళ్లారు. అయితే ఇటీవలి కాలంలో బీఆర్ఎస్-బీజేపీలు కలిసి పోయాయని, బీఆర్ఎస్‌కు ఓటేస్తే బీజేపీకి వేసినట్టే నంటూ కాంగ్రెస్ గట్టిగా ప్రచారం చేస్తూ వచ్చింది. 'మద్యం కేసు'కు సంబంధించి కవిత విషయంలో కేంద్రం వ్యవహరించిన తీరు, ఎన్డీయేలో చేరతానంటూ కేసీఆర్ స్వయంగా తన వద్దకు వచ్చారని ప్రధాని మోదీ పేర్కొనటం, బీజేపీ తీసుకొచ్చిన కొన్ని బిల్లులకు బీఆర్ఎస్ మద్దతు తెలపటం.. లాంటి విషయాలను కాంగ్రెస్ జనంలోకి బలంగా తీసుకెళ్లింది. బీఆర్ఎస్-బీజేపీ దోస్తీ అంటూ ఆ పార్టీ చేసిన ప్రచారాన్ని ముస్లింలు నమ్మారని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. అయితే హైదరాబాద్ వరకు మాత్రం బీఆర్ఎస్ వైపే నిలిచారని పేర్కొంటున్నారు. ఇతర ప్రాంతాల్లో ముస్లింలు క్రమంగా కాంగ్రెస్‌కు చేరువవుతున్న తీరును గుర్తించే రేవంత్‌రెడ్డిపై ఆర్ఎస్ఎస్ ముద్ర వేసే ప్రయత్నం ఒవైసీ చేశారని గుర్తు చేస్తున్నారు. కాంగ్రెస్ గెలిస్తే మళ్లీ మత కలహాలు పెరుగుతాయంటూ బీఆర్ఎస్ నేతలు ప్రచారం చేయడం కూడా ఇందులో భాగమేనని అంటున్నారు.

సాధికార మహోత్సవం

ప్రజల ఆదరాభిమానాలతో రాప్తాడులో దిగ్విజయంగా సామాజిక సాధికార బస్సు యాత్ర

- వేలాదిగా తరలివచ్చిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజలు
- బహిరంగ సభకు హాజరైన అశేష జనవాహిని
- జై జగన్ నినాదాలతో హోరెత్తిన సభ

సాక్షి,అమరావతి/రాప్తాడు రూరల్: ఫ్యాక్షన్‌ను తోసిరాజని అనంతపురం జిల్లా రాప్తాడులో సామాజిక సాధికారత నినాదం మార్మోగింది. రాయలసీమ ప్రాంతంలో కీలక నియోజకవర్గం అయిన రాప్తాడులో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రజల ఆదరాభిమానాలతో సామాజిక సాధికార బస్సు యాత్ర సోమవారం అపూర్వ రీతిలో ఉత్సవంలా సాగింది. వేలాదిగా తరలి వచ్చిన ఎస్సీ, ఎస్టీ బీసీ, మైనార్టీ ప్రజలు విజయయాత్ర చేశారు. ముఖ్యంగా మహిళలు కూడా పెద్దసంఖ్యలో తరలిరావడం విశేషం. సీఎం వైఎస్ జగన్ పాలనలో తమకు లభించిన ప్రాధాన్యతను, రాజ్యాధికారం పొందిన వైనాన్ని ప్రజలకు వివరించారు. అనంతరం జరిగిన సభకు బడుగు, బలహీన వర్గాల ప్రజలు పోటెత్తారు. సీఎం జగన్ నామస్మరణతో సభా ప్రాంగణం మార్మోగింది. సీఎం వైఎస్ జగన్ రాష్ట్రంలో సామాజిక సాధికారత సాధించిన వైనాన్ని మంత్రులు, వైఎస్సార్‌సీపీ నేతలు వివరించినప్పుడు ప్రజలు పెద్దపెట్టున హర్షధ్వానాలు చేశారు. 'జగనన్నే మా భవిష్యత్తు.. 2024 ఎన్నికల్లో మళ్లీ వైఎస్ జగనే గెలవాలి .. జగనే కావాలి' అంటూ ఒకే గొంతై నినదించారు.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి



అనంతపురం జిల్లా రాప్తాడులో సామాజిక సాధికార సభకు హాజరైన భారీ జనసందోహంలో ఓ భాగం

కురుమూర్తిస్వామి ఆభరణాల తొలగింపు



కురుమూర్తి స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

- స్వామివారి దర్శనానికి తరలివచ్చిన భక్తులు

చిన్నచింతకుంట: కురుమూర్తి జాతర వైభవంగా కొనసాగుతుంది. ఉత్సవాలకు రాష్ట్రంతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర, ఆంధ్రా నుంచి భక్తులు తరలి వస్తున్నారు. సోమవారం ఉదయం నుంచే లైన్‌లో వేచి ఉన్నారు. పూజారులు ఆలయాన్ని శుద్ధిచేసి సుప్రభాత సేవతో పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. స్వామి వారి పాదాలు తాకితే పాపాలు తొలిగిపోతాయన్న భక్తుల ప్రగాఢ నమ్మకం. దీంతో ఉద్దాల మండపం వద్ద భక్తులు స్వామివారి పాదుకలను దర్శించుకున్నారు. ఆలయ మెట్ల ముఖ ద్వారం నుంచి స్వామివారి ప్రధాన ఆలయం వరకు మెట్లపై ప్రాంగణంలో దీపాలను వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారిని దర్శించుకుని ముడుపులు సమర్పించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ సిబ్బంది అన్ని ఏర్పాట్లు చేశారు.

స్వామికి ఆభరణాల తొలగింపు..

కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాలు, జాతర పురస్కరించుకుని గత నెల 18న ముక్కెర వంశస్తులు చేయించిన ఆభరణాలను స్వామివారికి పూజారులు అలంకరించారు. ఈ కార్యక్రమం వైభవంగా కొనసాగింది. ఈ ఆభరణాలను వాటి సంరక్షణకై సోమవారం స్వామివారి విగ్రహం నుంచి సాంప్రదాయబద్ధంగా అధికారుల సమక్షంలో తొలగించారు. అధికారులు పరిశీలించిన అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పోలీసు కాన్వాయ్‌లో కట్టుదిట్టమైన భద్రతల నడుమ ఆత్మకూర్ ఎస్‌బీఐ బ్యాంకుకు తరలించారు. జాతరను పురస్కరించుకుని ఇప్పటికి 8 లక్షల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ సిబ్బంది పేర్కొన్నారు. స్వామి వారికి ఆభరణాలను తొలగించినప్పటికి అమవాస్య వరకు జాతర కొనసాగుతుందని ఆలయ ఈఓ మదనేశ్వర్‌రెడ్డి, చైర్మన్ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణయ్య, ఆర్ఐ తిరుపతయ్య, ఎస్ఐ శేఖర్, ఆలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.



స్వామి ఆభరణాలను బ్యాంకుకు తరలిస్తున్న అధికారులు



ఆభరణాలను తొలగించి పరిశీలిస్తున్న అధికారులు



కొబ్బరికాయలు కొట్టేందుకు క్యూలో భక్తులు



ఆలయ ప్రాంగణంలో దీపాలను వెలిగిస్తున్న భక్తులు

ఆత్మకూరు బ్యాంకుకు ఆభరణాల తరలింపు



ఆత్మకూర్‌లోని ఎస్‌బీఐకు చేరిన కురుమూర్తిస్వామివారి ఆభరణాలు

ఆత్మకూర్: తిరుమల తిరుపతి వేంకటేశ్వరస్వామి ప్రతిరూపమైన కురుమూర్తి స్వామివారి అలంకారోత్సవం ముగిసింది. సోమవారం సాయంత్రం పట్టణంలోని ఎస్‌బీఐ బ్రాంచ్‌లో ప్రత్యేక లాకర్‌లో ప్రత్యేక పూజలు నిర్వహించి భద్రపరిచారు. ముక్కెర రాజవంశీయులు స్వామివారికి వజ్రాలు, కెంపులు, వైఢూర్యాలు పొదిగిన ఆభరణాలను సమర్పించుకున్నారు. నవంబర్ 18వ తేదీన అలంకారం నిర్వహించి 16 రోజుల పాటు స్వామివారు స్వర్ణకాంతులతో దర్శనమిచ్చారు. పోలీసుల ప్రత్యేక బందోబస్తు మధ్య ఆభరణాలను బ్యాంకులో భద్రపరిచారు. కార్యక్రమంలో ఈఓ మదనేశ్వర్‌రెడ్డి, చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, ఎస్ఐ శేఖర్, జూనియర్ అసిస్టెంట్ శివానందచారి, సభ్యులు శంకర్‌శెట్టి, శంకర్‌యాదవ్, భీమయ్య, వెంకట్రాములు, వెంకట్‌నాయక్, శ్రీను, నర్సింహులు తదితరులు ఉన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో పతకాలు సాధించాలి

- జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యనిర్వాహక కార్యదర్శి రమేష్‌బాబు
- ఉత్సాహంగా ఉమ్మడి జిల్లా అండర్-17 అథ్లెటిక్స్ ఎంపికలు

మహబూబ్‌నగర్ క్రీడలు: రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో క్రీడాకారులు ప్రతిభచాటి పతకాలు సాధించాలని జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యనిర్వాహక కార్యదర్శి రమేష్‌బాబు అన్నారు. జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియంలో సోమవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఉమ్మడి జిల్లా అండర్-17 విభాగం బాల, బాలికల అథ్లెటిక్స్ ఎంపికలు నిర్వహించారు. 100, 200, 400, 800, 1500, 3వేల మీటర్ల పరుగుతోపాటు లాంగ్‌జంప్, హైజంప్, షాట్‌పుట్, డిస్కస్‌త్రో, జావెలిన్‌త్రో, హ్యామర్‌త్రో, 5కి.మీ., 3కి.మీ.లలో ఎంపికలు నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్‌బాబు మాట్లాడుతూ ఎంపికల్లో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 250 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులు మంగళవారం నుంచి ఈనెల 7వ తేదీ వరకు హన్మకొండలో రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ సహాయ కార్యదర్శి వేణుగోపాల్, వ్యాయామ ఉపాధ్యాయులు పరశురాం, సూర్యప్రకాష్, సాదత్‌ఖాన్, బాల్‌రాజు, ఆనంద్‌కుమార్, నిరంజన్‌రావు, ఉమాదేవి, అంజనమ్మ, ప్రసన్న, శ్రీను, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రమేష్‌బాబు

పార్లమెంట్‌లో బీసీ బిల్లు ప్రవేశపెట్టాలి

మహబూబ్‌నగర్ రూరల్: బీసీ బిల్లును పార్లమెంట్ సమావేశాలలో ఆమోదించి చట్టసభలలో రిజర్వేషన్లు కల్పించాలని బీసీసేన రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి చిత్తశుద్ధి ఉంటే ప్రస్తుతం కొనసాగుతున్న పార్లమెంట్ సమావేశాలలోనే బీసీ బిల్లు ప్రవేశపెట్టి చట్టసభలలో బీసీలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. త్వరలో చేపట్టబోయే దేశ జనాభా గణనలో బీసీ కుల గణన చేపట్టడంతో పాటు కేంద్రంలో మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని అన్నారు. బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించి క్రిమిలేయర్ విధానాన్ని ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో వెంకటేష్‌యాదవ్, వెంకటేష్, రాము, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

చోరీకి యత్నించిన మహిళలు పట్టివేత



బ్యాంకులో నగదు చోరీకి పాల్పడిన మహిళలను స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు

- బ్యాంకు లోపలే నగదు ఎత్తుకెళ్లేందుకు ప్రయత్నం
- పట్టుకున్న బ్యాంకు సిబ్బంది, ఖాతాదారులు

గద్వాల క్రైం: బ్యాంకులో నగదు జమ చేసేందుకు వచ్చిన ఖాతాదారుల నుంచి అపహరించేందుకు వచ్చిన ముగ్గురు మహిళలను గుర్తించి పోలీసులకు అప్పగించిన ఘటన గద్వాల ఎస్‌బీఐ ప్రధాన బ్రాంచ్‌లో సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పట్టణానికి చెందిన ఎస్‌యల్‌వీ మద్యం దుకాణానికి సంబంధించిన రూ.5.72లక్షల నగదును ఖాతాలో జమ చేసేందుకు నవీన్ ఎస్‌బీఐ ప్రధాన బ్రాంచ్‌కు వచ్చాడు. అయితే అప్పటికే మధ్యప్రదేశ్ రాష్ట్రం గొవ్‌కాడియకు చెందిన ముగ్గురు మహిళలు అదే బ్యాంకులో ఖాతాదారులుగా ఎవరికీ అనుమానం కలగకుండా ఉన్నారు. పెద్ద మొత్తంలో నగదును జమ చేస్తున్న నవీన్ బ్యాంగులోంచి నగదు గుట్టుగా ఎత్తుకెళ్లేందుకు ప్రయత్నం చేస్తున్నారు. గమనించిన కొంత మంది ఖాతాదారులు వారిని పట్టుకున్నారు. అప్రమత్తమైన బ్యాంకు సిబ్బంది, ఖాతాదారుడు పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ శ్రీకాంత్ సిబ్బంది అక్కడికి చేరుకుని మహిళలను అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. ఎంత మంది వచ్చారు? ఇంకా పట్టణంలో ఏవైనా చోరీలకు పాల్పడేందుకు ముఠాగా వచ్చారా? అనే విషయాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. అయితే ఈ ఘటన తెలుసుకున్న పలువురు అయోమయంలో పడ్డారు.

పవర్‌లిఫ్టింగ్ విజేతకు సన్మానం



ప్రదీప్‌కుమార్‌ను సన్మానిస్తున్న అధికారులు

మహబూబ్‌నగర్ క్రీడలు: కిరిగిస్థాన్ దేశంలో ఇటీవల ప్రపంచ పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో ప్రతిభచాటి మూడు బంగారు పతకాలు సాధించిన రాచకొండ పోలీస్ కమిషనరేట్‌లో ఏఏఓగా పనిచేస్తున్న ప్రదీప్ కుమార్ సన్మాన కార్యక్రమాన్ని సోమవారం ఉమ్మడి జిల్లా ట్రెజరీశాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. ప్రపంచ పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో పతకాలు సాధించడం అభినందనీయమని అన్నారు. ఈ సన్మాన కార్యక్రమం ట్రెజరీ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించగా, ఏఏఓ హరిప్రసాద్ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. కార్యక్రమంలో ఆయా జిల్లాలోని డీటీఓలు, ఉద్యోగులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గెలిచిందని పాలు ఉచితం



పట్టణానికి చెందిన పాల వ్యాపారి సత్యరెడ్డి సోమవారం తమ పాలబూత్‌కు వస్తున్న వినియోగదారులకు పాలను ఉచితంగా పంపిణీ చేశాడు. రాష్ట్రంలో, మక్తల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపొందడంపై సత్యారెడ్డి తన సంతోషాన్ని ఇలా పంచుకున్నాడు. పేదల అభ్యున్నతి కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతుందని, అందుకే ప్రజలందరూ ముకుమ్మడిగా రాష్ట్రంలో అధికారం ఇచ్చారన్నారు. పాలను ఫ్రీగా ఇస్తున్నారని తెలవడంతో పట్టణ ప్రజలు ఎగబడ్డారు.

- అమరచింత